"చెప్పను".

"చెప్పవూ" షాక్ యిచ్చాడు.

సుదర్శన్ ఎగిరిపడ్డాడు. ఎలీనా దగ్గరకు రాబోయింది "సుదర్శన్" అంటూ.

"దగ్గరకు రాకు ఎలీనా. నన్ను తాకకు" అనబోయాడు. కానివాడు తిరిగి షాక్ కొట్టాడు.

సుదర్శన్ మళ్ళీ ఎగిరి పడిపోయాడు

"అన్నయ్యా!" అని బేబీ అతన్ని పట్టుకుంది. నౌకర్ల నందర్నీ పిలిచేస్తోంది పిచ్చిగా.

ఎలీనాకి ఏం అర్థం కాలేదు. అతని దగ్గరకు రాబోయింది.

"వద్దు. తాకకు. వాడికి వేవ్‌లెంగ్త్ తెలిసిపోతుంది"

"వేవ్ లెంగ్త్ ఏవిట్రా!"

"ఎలీనా! దగ్గరకు రాకు రాకు. రాకు."


ఇక లాభం లేదని వాడు రెండు షాక్స్ గట్టిగా యిచ్చాడు. "తాకనీయ్‌రా! అది కావాలి నాకు."

సుదర్శన్ అంత ఎత్తుకి ఎగిరి పడ్డాడు. గిజగిజ గింజుకున్నాడు. మరో షాక్. దొర్లిపోతున్నాడు.

ఎలీనా ఛట్టున అతని దగ్గరికి వచ్చి "సుదర్శన్" అని పట్టుకుంది

సుదర్శన్ ఏడ్చేశాడు. "ఎలీనా! ఎలీనా! ఎలీనా! చంపేశావ్" అని స్పృహతప్పి పడిపోయాడు సుదర్శన్. "ఎలీనా! నీ వేవ్ లెంగ్త్ వాడికి తెలిసిపోయింది... ఎలీనా! తెలిసిపోయింది...."

(సశేషం)



మినీకథ:

# ఎవరిది బీదరికం?

కె. ఉష

టంగ్ ... టంగ్ ... టంగ్....

పీచుమిఠాయి బండి గంట శబ్దం వినగానే ఒళ్ళు జలదరించింది. శబ్దం వినగానే ఎక్కడో ఆడుకుంటున్న బాబిగాడు పరుగులమీద నన్ను చేరుకున్నాడు. డబ్బు బాబిగాకి చేతికిస్తూ అప్రయత్నంగా బండివానికేసి చూశాను. ఎక్కడికో చూస్తున్న గాజుకన్ను. చింపిరి జుట్టు. మాసిపోయి అక్కడక్కడ చిరిగిన బట్టలు. దుమ్ము పేరుకుపోయిన ఒళ్ళు. పేపరును పొట్లంలాగా చుట్టి దానిలో మిఠాయి పెట్టి ఇస్తున్నప్పుడు అతని చేతులు చూసి ఇక భరించలేక వెనక్కు తిరిగాను.

బాబిగాడికి ఇంట్లో సర్వస్వం వున్నా వాడికా పీచుమిఠాయి అంటే ప్రాణం. కొనివ్వటానికేం అభ్యంతరంలేదు కాని ఆ బండిమనిషిని చూడగానే అంతవరకు అంగీకరించిన మనస్సు తీవ్రంగా ఎదురు తిరుగుతుంది. బహుశ చిన్నప్పటినుంచి శుభ్రతకు అలవాటుపడ్డ నా మనస్తత్వమే దీనికి కారణమనుకుంటా. ఇక లాభంలేదు. ఎలా అయినా బాబిగాడికి ఈ అలవాటు మాన్పించాలని నిశ్చయించుకున్నాను.

మరుసటిరోజు యథారీతిగా బండి రావటం చూసి బాబి నా దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చాడు. "చూడ్రా బాబీ. ఇవాళ నాన్నగారిదగ్గర డబ్బు తీసుకోవటం మర్చిపోయానుగాని మిఠాయి రేపు కొందువుగాని లేమ్మా" అని అంటూండగానే బాబిగాడి మొహంలో రంగులు మారాయి.

"ప్లీజ్ మమ్మీ" అంటున్న బాబిగాడ్ని చూసి జాలేసింది. అయినా తమాయించుకున్నాను. "చెబుతుంటే నీకు కాదట్రా" అంటూ వంట గదిలోకి వెళ్ళబోతున్న నాకాళ్ళు రెండూ చుట్టేశాడు బాబిగాడు. నచ్చచెప్పాలని చూశాను కాని వల్లగాలేదు. నాలో సహనం చచ్చిపోతోంది. పైగా బయట్నించి ఆ మిఠాయి బండి మనిషి చూస్తూ ఉంటాడన్న ఆలోచన రావడంతో ఇక కోపం పట్టలేక నాలుగు బాదాను. దానితో వాడు నన్ను వదిలేసి ఇల్లదిరిపోయేలాగా ఏడుపును తారస్థాయిలో అందుకున్నాడు. ఇంతలో "అమ్మగారు" అన్న పిలుపుతో ఉలిక్కిపడి గేటు వంక చూశాను. ఆ మనిషే. నాలో కోపం కట్టలు తెంచుకుంది. ఇతడి మూలంగానే కదూ అన్నెం పున్నెం ఎరుగని ఆ పసి వెధవను అలా బాదింది. కోపంగా 'ఇక్కడ నీకేం పని' అన్నట్లుగా చూశాను. నా చూపుకు బెదిరి అతను కాస్తదూరం జరిగినెమ్మదిగా కుడిచేయి పిడికిలి తెరిచాడు. అతని చేతిలో మిఠాయిపొట్లం! మిఠాయి పొట్లాన్ని చూడగానే టక్కున ఏడుపు మానేసి నేనేదో అనేలోగా టక్కున దాన్నందుకున్నాడు బాబిగాడు. కోపంగా గుడ్లురిమి చూస్తున్న నావేపు ఇబ్బందిగా చూసి, "డబ్బుదేముందిలేమ్మా. ఇయాల్టి కొగ్గేసుకోండి. బాబేడుస్తాంటే సూళ్ళేనమ్మా. సెమించి తీసుకోండి తల్లీ" అనేసి మిఠాయితింటున్న బాబిగాడ్ని చూసి ఆ గాజుకన్నునే ఆనందంగా రెపరెపలాడించి వెనక్కి తిరిగి వెళ్తున్న అతడిని చూసి అవాక్కయిపోయాను.